



శ్రీకాళహస్తిలో ఉపాధ్యాయ అభ్యర్థి బాబురెడ్డితో...

లేదు లేదంటూనే..
తిరుపతిలో 'దొంగోట్లు'

- అధికారుల తీరుపై అనుమానాలు
- ఖాళీస్థలాల్లోనే 14మంది పేర్లు
- ఒకే ఇంటిలో 22 మంది
- ఐదో తరగతి చదివినా పట్టభద్రుడే..



తిరుపతిలో దొంగోట్ల వివరాలను వెల్లడిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఎంఎల్‌సి పట్టుభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో అధికారపార్టీ గెలుపుకోసం తిరుపతి అర్బన్ తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, అధికారుల తీరు చూస్తుంటే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భారీగా దొంగ ఓట్లు నమోదు చేశారని వామపక్షాలు పదేపదే ఫిర్యాదు చేసినా, ఆందోళన చేసినా వారి తీరు ఏ మాత్రం మారలేదు. తిరపతి నగరంలోనే భారీగా దొంగ ఓట్లు నమోదు చేశారు. ఖాళీస్థలం చూపించి, డోర్‌నెంబర్ సృష్టించి 14మంది పట్టుభద్రులు ఉన్నట్లు ఓటర్ జాబితాలో చూపించారు. బ్లిస్ హోటల్ వెనకవైపు ఓ ఇంటిలో 22మంది ఓటర్లు ఉన్నట్లు చూపించారు. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు, ఎన్నికల అధికారులకు పలుమారు ఫిర్యాదు చేసినా కొంతమంది పేర్లు తొలగించి మిగిలిన వారిని అలానే కొనసాగించారు. తిరుపతి నగరంలో ఓ వ్యక్తి అసలు చదువుకోలేదు. అయిన మన అధికార్లు పట్టుభద్రుల ఓటర్ జాబితాలో అతను ఓటరుగా నమోదు చేశారు. 5తరగతి చదువుకున్న వ్యక్తి కూడా ఓటర్ జాబితాలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు చూపించారు. దొంగ ఓటర్లను తొలగించడంలో తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ ఏమాత్రం కృషి చేయలేదన్న విమర్శలున్నాయి. అధికార పార్టీ నేతలు చెప్పిందే ఆయన చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో అప్పటి తిరుపతి అర్బన్ తహశీల్దార్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లు, తిరుపతి రూరల్ తహశీల్దార్‌గా పనిచేసిన కిరణ్‌కుమార్(ప్రస్తుతం గూడూరు ఆర్‌డిఓ) అధికారపార్టీకి అనుకూలంగా దొంగ ఓట్లు చేర్పించారు. వామపక్షాలు పలుమారు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోకపోవడంతో ఎన్నికల కమీషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఎన్నికల కమీషన్ స్పందించి వారి ఇద్దరిని ఎన్నికల విధుల నుంచి తప్పించడమే కాకుండా సస్పెండ్ చేసింది. పోలింగ్ బూత్‌నెంబర్ 222లో సీరియల్ నెంబర్ 881నుంచి 884వరకు 887, 888, 893, 894, 895, 896 మొత్తం 10ఓట్లు ఇల్లుకూడా లేని ఖాళీస్థలంలో ఇంటినెంబర్ 18-1/66ఎఫ్ పేరుతో నమోదు చేశారు. పోలింగ్ బూత్‌నెంబర్ 226లో సీరియల్‌నెంబర్ 896నుంచి 898 వరకు, 901నుంచి 904 వరకు, 911నుంచి 914 వరకు, 916 ,1155వరకు ఇకే ఇంటినెంబర్ 18-6-406 సుందరయ్యనగర్ మొదటి క్రాస్ నమోదు యిన 14దొంగ ఓట్లు తొలగించాలని వామపక్షాలు కోరుతున్నాయి. పోలింగ్ బూత్‌నెంబర్222లో సీరియల్ నెంబర్ 945నుంచి952 వరకు ఒకే ఇంటినెంబర్ 18-190/12ఇలో నమోదుయిన 8దొంగ ఓట్లు ఇప్పటివరకు అధికార్లు తొలంగించపోవడం విశేషం. ఆనంతవీధిలోని పోలింగ్ బూత్‌నెంబర్ 229 ఇంటినెంబర్ 5-2-127 సీరియల్‌నెంబర్ 129నుంచి 143 వరకు145నుంచి 166 వరకు మొత్తం 24 ఓట్లు అక్రమంగా నమోదు చేశారు. ఈఓటర్లు ఈప్రాంతంలో ఎవరికి తెలియదు. పోలింగ్ బూత్‌నెంబర్ 223 చింతలచేను పలు దొంగ ఓట్లు నమోదుయి. ఇక్కడ ఓటర్లు ఎవరు డ్కిగీపూర్తిచేయలేదు. ఇక్కడ ఉన్న ఓటర్లు ఒక్కరుకూడా డిగ్రీ విద్యార్హత లేదు. ఒక్కోపోలింగ్ బూత్ పరిధిలో చింతలచేను లోని ఒక వీధిలోని ఇళ్లలో ఇన్ని దొంగ ఓట్లు ఎలా నమోదయ్యాయి. డిగ్రీ చదివిన వారిగా నిర్ధారించి సంబందింత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ నేతలు కోరుతున్నారు.

ఉద్యమ అభ్యర్థులను గెలిపించండి

జిల్లావ్యాప్తంగా ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి, యంత్రాంగం

ఈ నెల 13న జరిగే తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన శ్రీకాళహస్తి ప్రాంతంలో విస్తతంగా పర్యటించారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బాబురెడ్డి కలుసుకున్నారు. అనంతరం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. బాబురెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ ఏడాది జూలై 1 నాటికి నూతన పిఆర్సి అమలు చేయాల్సి ఉందనీ, అందుకు తగ్గట్లుగా పే రివిజన్ కమిటీని నియమించలేదని మండిపడ్డారు. సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలు హామీలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. కొత్త డీఏలు, నెలవారీ జీతాల కోసం ఉపాధ్యాయులు ఎదురుచూడాల్సి రావడం దురదష్టకరమన్నారు. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ అధ్యాపకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, దాన్ని అమలు చేయకపోగా 12 నెలలకు అందాల్సిన జీతాలను 10 నెలలకు కుదించి బహుమతిగా ఇచ్చిందని ఎద్దేవా చేశారు. శాసనమండలి వేదికగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకోవాలన్నా, హక్కులను సాధించుకోవాలన్నా రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులను మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు షరీఫ్, సిఐటియు నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, కుమార్, సునీల్,



నజీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

గూడూరు/ రూరల్‌లో.. సిఐటియు నాయకులు రామంజి మణి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం, బిఎస్ఎన్ఎల్, పోస్టాఫీసు, ఎండిఒ ఆఫీసులలో కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలంటే పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. శేషయ్య, ఎం.వెంకట్రావు పాల్గొన్నారు. సిఐటియు నాయకులు జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, ఎస్.సురేష్, బి.చంద్రయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులను బ్యాంకు, విద్యుత్ సిబ్బందిని, టుటౌన్ పోలీసులను కలిసారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, పి.బాబురెడ్డిలను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. గూడూరు అశోక్‌నగర్‌లోని సిపిఎం, సిపిఐ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్మిక, కష్టజీవుల సమస్యలపై గొంతెత్తే పీడీఎఫ్‌ను గెలిపించకుంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు.

పుత్తూరు టౌన్‌లో.. మున్సిపల్ కార్యాలయంలో, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సిపిఎం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

అన్నప్రసాదంపై దుష్ప్రచారాన్ని ఖండించిన టిటిడి

ప్రజాశక్తి -తిరుమల



తిరుమలలో మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం పై రాధామోహన్ దాస్ అనే భక్తుడు దురుద్దేశ పూర్వకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో ప్రచారాన్ని ఈవో ఖండించారు. ఇందుకు సంబంధించి పలువురు భక్తులు అన్నప్రసాదం చాలా బాగా ఉందని వెల్లడించిన వీడియో ను ప్రదర్శించారు. అన్నప్రసాద కేంద్రంలో ఉపయోగించే బియ్యం, ఇతర సరుకులు, కూరగాయలు వివిధ దశల్లో క్షుణ్ణంగా పరీక్షించిన తరువాతే వంటకు ఉపయోగిస్తున్నామని ఈవో వివరించారు. టీటీడీ మీద రాధామోహన్ దాస్ చేసిన దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు

బ్రెయిన్‌డెడ్ అయినవారు గుండె దానం చేయాలి

శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె ఆసుపత్రిలో నెల రోజుల్లోనే రెండు గుండెమార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి గుండెను దానం చేయడానికి వారి కుటుంబ సభ్యులు ముందుకురావాలని ఆయన పిలుపు నిచ్చారు. గుండె దానం చేయాలనుకునే వారు ముందుగా టీటీడీ కి తెలియజేస్తే వైద్యబందం సకాలంలో వచ్చి గుండె సేకరించి దాన్ని మరో బాలుడు లేదా బాలికకు అమర్చి వారి ప్రాణాలు కాపాడతామన్నారు.

28 రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం 114 కోట్లు

ఫిబ్రవరి నెలలో శ్రీవారిని 18.42 లక్షల మంది దర్శించుకున్నారు. 114 కోట్ల రూపాయలు కానుకలు, హుండీ ద్వారా ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో దాదాపు 26 మంది భక్తులు తమ సమస్యలు సలహాలు నేరుగా ఈఓ తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జే.ఈ.ఓ సదా భార్గవి, ఎస్వీ బీసీ సిఈఓ షణ్ముఖ్ కుమార్ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి పాపపు సొమ్ము వడ్డీతో రాబడతాం..!

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్ హామీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పులిచెర్ల

మంత్రి పెద్దిరెడ్డి పాపపు సొమ్ము ఈ నాలుగేళ్లలో పదివేలకోట్లకు పైగానే ఉందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పాపపు సొమ్మును వడ్డీతో సహా రాబట్టి పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. పెద్దిరెడ్డిని ఎవరైనా 'పెద్దాయనా' అని పిలవాలని చెబుతున్నారని భూములు దోచినందుకా? ఇసుక తిన్నందుకా? మట్టి మాఫియాను ప్రోత్సహించినందుకా? గంజాయిని ఎక్కువగా సరఫరా చేస్తున్నందుకా? అని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వస్తే పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవర్గాలను కలిపి మదనపల్లి జిల్లాను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 'యువగళం' పాదయాత్ర శుక్రవారం పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలం కొమ్మురెడ్డిపల్లి విడిది కేంద్రం నుంచి ప్రారంభమయ్యింది. 33వ రోజు శుక్రవారం 12.5 కిలోమీటర్లు నడిచారు. కొత్తపేట బహిరంగసభలో ప్రసంగించారు. ఎగువ బెస్తపల్లి, మంగళంపేట మెయిన్ సెంటర్‌లో స్థానికులతో మాటామంతీ నిర్వహించారు. బలిజపల్లిలో భోజన విరామం. మొప్పిరెడ్డిగారిపల్లి, పులిచెర్లలో ఎస్సీ సామాజికవర్గీయులతో ముఖాముఖి నిర్వహించారు. కొక్కువారిపల్లి విడిది కేంద్రంలో శుక్రవారం రాత్రి బస చేశారు.

కొత్తపేట బహిరంగసభలో అప్పర్ తుంగభద్రపై కర్నాటకలో ప్రాజెక్టు కడితే భవిష్యత్‌లో రాయలసీమ ఎడారిగా మారిపోతుందన్నారు. అయినా వైసిపి ఎంపిలు ఒక్కరూ నోరు విప్పడం లేదన్నారు. నారా లోకేష్ మాట్లాడుతూ వైసిపి ఎంఎల్‌సి అనంతబాబు దళితుని హత్య చేసి డోర్ డెలివరీ చేశారని, అతనొక గంజాయి స్మగ్లరన్నారు. పుంగనూరులో పీ3 ఫార్ములా అమలవుతుందని, పుంగనూరు-పెద్దిరెడ్డి- పాపాలు అని అన్నారు. పిఎల్ఆర్ కాంట్రాక్టు ఎవరూ తీసుకోవడం లేదని, గతంలో ఒక వైసిపి నాయకుడు తీసుకుని, బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రాష్ట్రమంతా అమూల్ కంపెనీలను పెట్టిన జగన్మోహన్‌రెడ్డి పుంగనూరులో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పెద్దిరెడ్డికి చెందిన శివశక్తి డెయిరీ కోసం మిగతా డెయిరీలను నాశనం చేస్తున్నాడన్నారు. రెండున్నరేళ్లలో శివశక్తి సంస్థ రైతుల కష్టార్జితాన్ని 20 కోట్లు దోచుకుందన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే పుంగనూరును ప్రక్షాళన చేస్తామన్నారు. పెద్దిరెడ్డి తమ్ముడి కొడుకు సుధీర్‌రెడ్డి పల్ప్ కంపెనీ కోసం మామిడి రైతులు పంట తమకే అమ్మాలని బెదిరిస్తూ, బయటివారికి అమ్మనీకుండా అడ్డుకుంటున్నారని, మూడేళ్లలో పెద్దిరెడ్డి సంస్థ మామిడి రైతుల నుంచి 100 కోట్లను దోచుకుందన్నారు. నెట్టిగుంటపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న రిజర్వాయర్ కోసం 100 మంది రైతుల భూములు లాక్కున్నారని, చీనీ చెట్లను కొట్టేశారన్నారు. పుంగనూరులో టిడిపి జెండా ఎగరేస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. 2024 ఎన్నికల్లో చల్లాబాబును ఆశీర్వదించాలన్నారు. వైసిపి పాలనలో పెట్టిన కేసులన్నీ కొట్టేయిస్తామన్నారు. తన పాదయాత్రలో 33 కిలోమీటర్లకు ఒక కేసు పెడుతున్నారని, అయినా తగ్గేదేలే అని అన్నారు. పుంగనూరు పెద్దిరెడ్డిని, తాడేపల్లి పిల్లిని శాశ్వతంగా ఇంటికి పరిమితం



చేయాలన్నారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అమర్ నాద రెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్, పుంగనూరు, పీలేరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ లు చల్లా రామచంద్రా రెడ్డి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఇంచార్జ్ గంటా నరహరి, రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎం ఎస్ రాజు , రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాధం నాయుడు పాల్గొన్నారు.

ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో...
అంబరాన్నంటిన ఆంపిల్ వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి



తిరుపతి- కరకంబాడి మార్గంలోని ఎస్ వి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం ఆంపిల్-2023 ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నియోలిస్క్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ క్లైమాస్ తోబియాస్ , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి ,ప్రోగ్రాం సమన్వయకర్తలు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి. శ్రీనివాసులు రెడ్డి ,సివిల్ విభాగాధిపతి డాక్టర్ చిత్రంజన్ జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన క్లైమాస్ తోబియాస్ మాట్లాడుతూ ఉద్యోగాలకు కావాల్సిన నైపుణ్యాలు, అర్హతలు వాటిని సాధించడానికి కావాల్సిన, నేర్చుకోవాల్సిన మార్గాల గురించి విశ్లేషించారు. నైపుణ్యత కలిగిన వారికి ప్రస్తుతం, రానున్న కాలంలో మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఇలాంటి సింపోజిములు విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి దోహదపడతాయని తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ నిపుణుల ఆవశ్యకత భవిష్యత్తులో మెండుగా ఉన్నాయన్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రులకు నైపుణ్యంతో పాటు స్కిల్ డెవలప్మెంట్ అనేది చాలా అవసరం అని తెలియజేశారు. రాబోవు కాలంలో భారత విద్యార్థులు ప్రపంచంలో ప్రధాన పాత్ర పోషిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి మన రాష్ట్రం నలుమూలల నుండి కాకుండా తెలంగాణ ,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 1000 మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోగా వీరిలో 500 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. విజేతలకు విభాగాల వారీగా బహుమతులు అందజేశారు. కళాశాల చైర్మన్ గంగిరెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్ అంబవరం, సెక్రటరీ ప్రదీప్ అంబవరం మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా అనేక శిక్షణ తరగతులు, నైపుణ్యాభివద్ధి కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తోందన్నారు.

అదానీ లోటు పూడ్చేందుకే గ్యాస్ ధర పెంపు

జిల్లావ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం



పాకాలలో..

ప్రపంచ కుబేరుల్లో ఒకడైన అదానీ ఆస్తులు ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ప్రధాని నరేంద్రమోడీ కుటిల బుద్ధితో గ్యాస్ ధర పెంచారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి విమర్శించారు. శుక్రవారం రైల్వేస్టేషన్ మెయిన్‌గేటు ఎదుట సిపిఐ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సిలిండర్లకు పూజలు చేస్తూ, నెత్తిన పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నం పెంచలయ్య, కె.రాధాక్రిష్ణ, ఎన్‌డి రవి, బి.నదియా పాల్గొన్నారు. గూడూరు రూరల్‌లో టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు. శశికుమార్, శివకుమార్ పాల్గొన్నారు. పుత్తూరులో అంబేద్కర్ సర్కిల్ వద్ద పట్టణ కార్యదర్శి డి.మహేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

'శ్రీజ' ముందంజ

పాల ఉత్పత్తిలో 'మహిళలు మహారాణులు'

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

మహిళా సాధికారతే లక్ష్యంగా సాగుతున్న 'శ్రీజ' ప్రయాణం పాల ఉత్పత్తిలో ముందంజలో ఉంది.. మహిళల ఆర్థిక స్థితిగతులను మార్చేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు కుటుంబాల్లో గౌరవాన్ని పెంచుతున్నాయి. పోటీతత్వంతో పరుగులు పెడుతున్నా, ఎక్కడా రాజీపడకపోవడం ఆ డెయిరీ ప్రత్యేకత. పాల ఉత్పత్తిదారులనుంచి డెయిరీ యాజమాన్యం వరకూ అందరూ మహిళలే.

2014లో చిత్తూరు జిల్లాలో డెయిరీలు సరిగ్గా లేకపోవడంతో కరువు ప్రాంతంలో పాడి రైతులను ఆదుకోవాలని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డిడిబి) సహకారంతో 'శ్రీజ' మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థగా ఆవిర్భవించింది. గ్రామీణ ప్రాంతాల మహిళల్లో ఆర్థిక చైతన్యాన్ని తీసుకొచ్చింది. నేడు ప్రపంచంలోనే అతి పెద్ద మహిళా పాల ఉత్పత్తిదారుల సంస్థగా ఖ్యాతిని సొంతం చేసుకుంది. నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితత్వంతో పాటిస్తూ వినియోగదారుల మన్ననలు అందుకుంటోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'శ్రీజ' ప్రత్యేక కథనం.

మొదటగా 2014లో కేవలం 27 మంది సభ్యులతో ప్రారంభమైన శ్రీజ ప్రయాణం నేడు లక్షకు పైగా సభ్యులతో రోజుకు సగటుగా నాలుగున్నర లక్షల పాల సేకరణ జరుగుతోందంటే శ్రీజ అకుంఠిత సంకల్పానికి ఇది నిదర్శనంగా చెప్పవచ్చు. నెలలో రెండు సార్లు పాలు పోసిన వారికి పారదర్శకంగా నగదు చెల్లింపులు కేవలం మహిళ ఖాతాల్లోకి మాత్రమే జమచేయబడుతాయి. మహిళా సాధికారతకు ఇది మరో నిదర్శనం. ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం అనేది ఉండకుండా లబ్ధిదారులకు నగదు చెల్లింపులు జరుగుతాయని సంస్థ సిఈఓ జయతీర్థాచారి తెలిపారు. మహిళలను వారివారి కుటుంబ పోషణలో ప్రాముఖ్యత స్థానం కల్పించామన్న సంతోషం



చైర్మన్ సహా మహిళా డైరెక్టర్లు

కలుగుతోందని, మరింత మంది గ్రామీణ మహిళలను ఆర్థిక చైతన్యవంతులుగా చేయడమే లక్ష్యంగా శ్రీజ కార్యకలాపాలు కొనసాగిస్తామని ప్రోక్యూర్‌మెంట్ హెడ్ తిమ్మప్ప తెలిపారు.

'శ్రీజ' డైరెక్టర్స్ బోర్డు నిర్వహణ ఓ ప్రత్యేకమే

15 మంది డైరెక్టర్స్‌తో బోర్డు నిర్వహణ జరుగుతుంది. శ్రీజ సంస్థకు పాలుపోసే వారు డైరెక్టర్లుగా నియమితులవుతారు. ఇందులో రాజకీయ పార్టీలలో పదవుల ఉన్న వారు అనర్హులు. డైరెక్టర్లుగా ఉండే వారు 12వ తరగతి వరకు ఉత్తీర్ణులై ఉండాలి. 13మంది మహిళలు(శ్రీజకు పాలు పోసే వారు) డైరెక్టర్లుగా ఉంటారు. కొంత మంది నిష్ణాతులూ డైరెక్టర్స్ బోర్డులో ఉంటారు వాప్యార సలహాలు అందివ్వడానికి. సమిష్టిగా నిర్ణయాలను తీసుకొని ఇటు సంస్థ ఎదుగుదలకు, వినియోగదారులకు, సంస్థను నమ్ముకొన్న వారికి చేయూతనివ్వడం జరుగుతుందని శ్రీజ బోర్డు ఛైర్మన్ శ్రీదేవి స్పష్టం చేశారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌కు సంస్థ ట్యాబ్‌లను అందించి, వార్షిక బడ్జెట్ రూపకల్పనలోనూ తగిన తర్ఫీదును అందిస్తోంది.

బాధ్యతతో నడుపుతున్నాం : సిద్దారెడ్డిగారి శ్రీదేవి, శ్రీజ సంస్థ ఛైర్మన్

శ్రీజ అంటే నాణ్యత పాల ఉత్పత్తులకు చిరునామాగా పేర ుతీసుకొస్తున్నాం. స్వచ్ఛమైన పాలను సమాజానికి అందివ్వాలనే కృతనిశ్చయంతో ప్రణాళిక బద్దంగా వ్యవహరిస్తున్నాం. మార్కెట్ పోటి ధరను శ్రీజ వాటాదారులకు అందివ్వడం జరుగుతోంది. శ్రీజ ఆవిర్భావంతో గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. నెలలో 15 రోజుల కోసారి కుటుంబం కోసం రూపాయి రాబోతుందన్న ధీమాను శ్రీజ తీసుకొచ్చింది.

ఈ సర్టిఫికెట్లు ఏం చేసుకోనూ అనుకున్నా : తాయారమ్మ, డైరెక్టర్,

పెళ్ళి అయ్యి అత్తగారింటికి వచ్చేసా... ఇక నేను చదువుకున్న సర్టిఫికెట్లు ఏం పనికొస్తాయి అనుకున్నా... కాని నేడు శ్రీజకు పాలు పోసి బోర్డులో డైరెక్టర్‌గా కూర్చోగలిగాను. శ్రీజ సంస్థ బోర్డులో డైరెక్టర్ అయిన నాకు మా ఇంట్లోనే కాదు... గ్రామంలో కూడా గౌరవం పెరిగింది. డైరెక్టర్‌గా ఉన్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

డైరెక్టర్‌గా చాలా విషయాలను తెలుసుకున్నా : చంద్రకళ, డైరెక్టర్

మొదటగా నేను రెండు ఆవులతో శ్రీజ సంస్థకు పాలు పోయడం ప్రారంభించాను. అదే నేడు ఏడు ఆవులకు పెరిగింది. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి నేడు చాలా విషయాలను తెలుసుకున్నాను. కుటుంబ నిర్వహణలో ఆర్థికంగా ఆదుకొనే స్థాయికి శ్రీజ నన్ను తీసుకొచ్చింది.

తక్కువ సమయంలోనే పక్క రాష్ట్రాలకు : జయతీర్థాచారి, సిఇఒ

శ్రీజ సంస్థను నెలకొల్పి అతి తక్కువ సమయంలోనే పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకకు శ్రీజ ఉత్పత్తులకు ఎగుమతులు చేయగలిగాం. శ్రీజలో మహిళల భాగస్వామ్యం చాలా కీలకం. వారి సహకారంతోనే సంస్థ ఇంత వేగంగా ఎదుగుతోందనడంలో అతిశయోక్తిలేదు. మరిన్ని అరుదైన విజయాల వైపు శ్రీజ నడుస్తుంది.

విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి బోధించాలని.. ఐఎఫ్‌పీ ప్యానల్‌చే విద్యాబోధన పెంపొందించుకోవచ్చని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ సూచించారు. పుత్తూరులోని శుక్రవారం ఐఎఫ్‌పీ ప్యానల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో శేఖర్, పుత్తూరు డీవైఈవో రఘురామయ్య మాట్లాడుతూ సరళంగా.. సమర్థవంతంగా విద్యాబోధన ఉండాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని ఏ విధంగా పెంచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరాజు, ప్రధానోపాధ్యాయులు ఆనందబాబు, డైట్ ప్రిన్సిపల్ చెంగల్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శరత్ బాపూజీ నివాస ఆశ్రమం పరిశీలన



ప్రజాశక్తి-కోట: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో శ్రీ సాయి నాథుని శరత్ బాపూజీ నివాస ఆశ్రమాన్ని ఎంపీడీవో భవాని, ఎంఈవో వెంకట సునీల్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎలాంటి ఆక్రమణలకు గురికాలేదని.. బ్రిటిష్ కాలం నాటి భవనంగా ఉండేదని.. తర్వాత శరత్ బాపూజీ నివాస ఆశ్రమంగా నిలిచిందన్నాను. శరత్ బాపూజీ మరణానంతరం లైబ్రరీగా ఉపయోగంలో ఉండేదని, ప్రస్తుతం ఎవరూ వాడకంలో లేకపోవడంతో నిరుపయోగంగా ఉందని తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీ



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్ మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం తనిఖీ చేశారు. జంగావాండ్లపల్లి పంచాయతీ మారసానివారిపల్లి హరిజనవాడ కుంటలో జరుగుతున్న పనులను, చిన్నగొట్టిగల్లు పంచాయతీ చిట్టేవాల్లపల్లి దగ్గరున్న అమత్ సరోవర్ చెరువు పనులు తనిఖీ చేపట్టారు. మస్టరు, పని కొలతలు, కూలి వివరాలనుయ కూలీలను అడిగి తెలుసుకుని వారికి పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో మత్యుంజయ రావు, జేఈ రెడ్డెప్ప, టీఏ నాగేశ్వర కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



దొరవారిసత్రం: ఏకొల్లు, వేణుంబాక గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి పనుల్లో భాగంగా చేపడుతున్న అమత సరోవర్ చెరువు నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీడీవో సింగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.257 దినసరి కూలి పడేలా పనులు చేయించాలని సూచించారు.

ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అఖిల భారత దళిత, గిరిజనుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గంధం చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం శుక్రవారం పట్టణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కూకట్లపల్లి ప్రసాద్ అధ్యక్షతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ను ఎన్నుకుంటూ ఏకగ్రీవ తీర్మాణం చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిపోతున్నా దళిత, గిరిజనులు రాజ్యాధికారానికి ఆమడదూరంలోనే ఉన్నారని వాపోయారు. రాజ్యాధికారం వైపు అడుగులు వేసేందుకు తనవంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



ప్రజాశక్తి-ఓజిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని గూడూరు డీఎల్‌పీవో వెంకటరమణ , ఎంపీడీవో రజనీకాంత్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సచివాలయాల సిబ్బందిదేనని తెలిపారు. పారిశుద్ధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఏపీ సేవా సర్వీస్, జగనన్న పక్కాగృహాల నిర్మాణాలు పలు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేఎస్ఎస్ఆర్పీ సీహెచ్ వెంకటరమణ, ఈవోపీఆర్డీ షేక్ సిరాజ్, పంచాయతీ కార్యదర్శులు , సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



ప్రజాశక్తి-దొరవారిసత్రం: ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నేలపట్టు పక్షుల కేంద్రానికి చెందిన అధికారులు ఘనంగా ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణులపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను డీఎఫ్‌వో సామేలు చేతుల మీదుగా అందించారు. వన్యప్రాణుల సంరక్షణపై, నేలపట్టు పక్షుల కేంద్రానికి విడిది చేరుతున్న విదేశీ విహంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నేలపట్టు పక్షుల కేంద్రం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వరప్రసాద్, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ధనంజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా 'తిరుపతి'.. బోర్డుల్లో 'చిత్తూరు'..!







- ఏడాది కావొస్తున్నా మారని రాతలు
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు

ప్రజాశక్తి-సత్యవేడు, పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం పలు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాల వ్యవస్థీకరణలో భాగంగా చిత్తూరు జిల్లా నుంచి కొన్ని మండలాలను నెల్లూరు జిల్లా నుంచి కొన్ని మండలాలను కలిపి తిరుపతి జిల్లాగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో 2022 ఏప్రిల్ 4వ తేదీన తిరుపతి జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు, నెల్లూరు జిల్లాల పరిధిలో నుంచి తొలగించి కొత్త జిల్లా కేంద్రం తిరుపతి పరిధిలోకి తీసుకొచ్చిన పలు మండలాల్లో ఏడాది గడుస్తున్నా.. మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను తెలిపే బోర్డుల్లో మాత్రం చిత్తూరు జిల్లా..నెల్లూరు జిల్లా అనే బోర్డులు నేటికీ నేటికీ దర్శనమిస్తుంటడం గమనార్హం. తిరుపతి జిల్లాలోని సత్యవేడు, పుత్తూరు, నాగలాపురం, బుచ్చినాయుడుకండ్రిగ, వడమాలపేట, ఓజిలి, బాలాయపల్లి, శ్రీకాళహస్తి, గూడూరు ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఉన్న రాతలు ఇప్పటికీ మార్చలేదు. తిరుపతి జిల్లాలో ఉన్నా.. చిత్తూరు జిల్లా, నెల్లూరు జిల్లా పేర్లు దర్శనమిస్తున్నాయి. సత్యవేడులోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, వెలుగు కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ బోర్డుల్లో ఇప్పటికీ చిత్తూరు జిల్లా పేరు దర్శనమిస్తోంది. అలాగే పుత్తూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు కార్యాలయం, అటవీశాఖ కార్యాలయం, పుత్తూరు విద్యావనరుల కేంద్రం వద్ద భవిత భవనాల బోర్డులు ఇప్పటికీ తిరుపతి జిల్లాలనే దర్శనమిస్తున్నాయి. తిరుపతి జిల్లాగా పేరు మార్చడానికి సంబంధిత అధికారులకు తీరిక లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దీనిపై స్పందించి ప్రభుత్వ కార్యాలయ నామ పలక బోర్డులో చిత్తూరు జిల్లా స్థానంలో తిరుపతి జిల్లాగా మార్చాల్సిన అవసరం ఉంది.







అస్తవ్యస్తం.. మురుగునీటి కాలువల నిర్మాణం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని కాపువీధిలో 14 ఫైనాన్స్ నిధులతో నిర్మిస్తున్న మురుగునీటి కాలువలు ముందు చూపు లేకుండా తక్కువ పొడవు, వెడల్పుతో అస్తవ్యస్తంగా నిర్మిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొత్తగా రూ.20 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే కాలువ లోపలి భాగం కేవలం ఒకటిన్నర అడుగు వెడల్పుతో దాదాపు రెండున్నర అడుగులు ఎత్తుతో నిర్మిస్తున్నారు. పెరుగుతున్న జనాభా, భవనాల నిర్మాణం నుంచి వెలువడే వ్యర్థాలకు సరిపోదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో శ్రీసిటీ ఎండీ



ప్రజాశక్తి-వరదయ్యపాళెం: విశాఖపట్నంలో శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జిఐఎస్)-2023కి కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు ఏపీకి చెందిన పలువురు మంత్రులు, సీనియర్ అధికారులు, ప్రముఖ వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీసిటీ స్టాల్‌ను ఏపీ సీఎం, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖుల సమక్షంలో నితిన్ గడ్కరీ ప్రారంభించారు. స్టాల్ ను తిలకించి వారు శ్రీసిటీ విశిష్టతను ప్రశంసించారు. ఇందులో డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, స్కేల్-డౌన్ మోడల్‌తో శ్రీసిటీ వ్యాపార నగరం ప్రత్యేకతలు, స్థాన ప్రయోజనాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను హైలైట్ చేశారు. శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలచే ప్రదర్శించబడిన వివిధ బ్రాండ్‌ల ఎయిర్ కండీషనర్లు, ఆటోమొబైల్ కాంపోనెంట్‌లు, వీల్ చైర్లు, ఇసుజు కార్లు తదితర "మేడ్ ఏ శ్రీ సిటీ ఉత్పత్తులు", సమ్మిట్‌కు విచ్చేసిన ప్రతినిధులను విశేషంగా ఆకర్షించాయి.

శ్రీనివాస సేతు మూడోదశ పనుల పరిశీలన



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: శ్రీనివాస సేతు మూడో దశ నిర్మాణ పనులు రేణిగుంట రోడ్డు నుంచి రామానుజ కూడలి వరకు శుక్రవారం సాయంత్రం మేయర్, ఉప మేయర్లు భూమన అభినయ్, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు, ఆఫ్కాన్స్ స్వామి పరిశీలించారు. అనంతరం రేణిగుంట రోడ్డులో మాస్టర్ ప్లాన్లు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ శ్రీనివాస సేతు మూడో దశ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. నగరంలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్లన్నీ ఏప్రిల్, మే నెలలో అందుబాటులోకి తీసుకు వస్తామని, తిరుమల, తిరుపతికి వచ్చే యాత్రికులకు తక్కువ వ్యవధిలోనే గమ్యం చేరేలా ఈ రోడ్లని అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఉప మేయర్ భూమన అభినయ్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు మూడో దశ నిర్మాణ పనులు రేణిగుంట రోడ్డు, తిరుచానూరు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు పనులు పూర్తి చేస్తున్నామని ఆఫ్కాన్స్ స్వామి తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లను మే నెలలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆంజనేయులు, తమ్ముడు గణేష్, శేఖర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉదయ్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ పెండింగ్ బిల్లులు చెల్లించండి



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: గృహనిర్మాణాల లే ఔట్ లకు సంబంధించి భూసేకరణ పరిహారంతో పాటు, చదును చేపట్టిన పెండింగ్ బిల్లుల చెల్లింపు పూర్తిచేయాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం జెసి డి.కె.బాలాజీతో కలసి హౌసింగ్ , తిరుపతి, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ అధికారులతో , తహసిల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు లే ఔట్ లలో గతంలో చేపట్టిన లెవెలింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా త్వరగా చెల్లించాలని సూచించారు. జిల్లాలో గృహనిర్మాణాలకు చేపట్టిన భూ సేకరణ బిల్లులు మరోమారు పరిశీలించి చెల్లింపుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పాగాలి, శ్రీనివాసపురం, అగరాల, చిందే పల్లి , దుర్గ సముద్రం , నీర్పాకోట లే ఔట్ల పై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ , హౌసింగ్ అధికారులు సంయుక్తంగా సత్వర చర్యలు చేపట్టి చెల్లింపులు చేపట్టాలని అన్నారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, తిరుపతి , శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారులు కనకనరసా రెడ్డి, రామారావు, హౌసింగ్ పి డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈఎంసీలో రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన ప్రోత్సహించడానికి మార్చి 2, 3 తేదీలలో ఏర్పాటు చేసిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 లో భాగంగా తిరుపతి, కడప జిల్లాల పరిధిలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ల లో పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ముందుకొచ్చి ఎంవోయూల మార్పిడి జరిగిందని ముఖ్య కార్యనిర్వహణాధికారి (సి ఈ ఓ) ఈఎంసీ గౌతమి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 కార్యక్రమం ఆంధ్ర విశ్వ విద్యాలయంలో అడ్వాంటేజ్ ఆంధ్రప్రదేశ్ అనే నినాదంతో పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన రెండు రోజుల కార్యక్రమంలో పలు పరిశ్రమల యాజమాన్యాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొని ఎంవోయూలు మార్పిడి చేసుకున్నారని సీఈవో, ఈఎంసీ అన్నారు. అందులో తిరుపతి, కడప ఈఎంసీ క్లస్టర్ల పరిధిలో పరిశ్రమల స్థాపనకు ఎంతో అనుకూల పరిస్థితులు ఉన్నాయని రోడ్డు , రవాణా, రైలు మార్గం, విమానాశ్రయం కలిగి అనుకూల రవాణా మార్గాలు ఉన్నాయని, అలాగే మానవ వనరులకు కేంద్ర విద్యా సంస్థలు, విశ్వ విద్యాలయాలు తదితర అత్యంత సౌకర్యవంతమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల స్థాపనకు అన్ని అనుమతులు త్వరితగతిన అందించి పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహిస్తోందని, అందులో భాగంగా ఈఎంసి క్లస్టర్ల పరిధిలో సుమారు రూ.10,072 కోట్ల పెట్టుబడి పెట్టడానికి 8 ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్- 1, 2 పరిధిలో సన్నీ ఒప్పో టెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ మొబైల్ కెమెరా మాడ్యూల్స్ రూ.2500 కోట్లు, టి సి ఎల్ గ్రూప్ ప్యానెల్ మాన్యుఫాక్చరింగ్ రూ. 5000 కోట్లు, క్లైర్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఎల్ ఈ డి మాన్యుఫాక్చరింగ్ రూ. 90 కోట్లు, నియో లింక్ గ్రూప్ 5 జి ప్రొడక్ట్స్ మాన్యుఫాక్చరింగ్ రూ.300 కోట్లు, ఎస్ 2 పి సోలార్ సిస్టం ఎల్ ఎల్ పి కంపెనీ సోలార్ సెల్ మాన్యుఫాక్చరింగ్ రూ. 850 కోట్లు, సెల్కాన్ రేసోల్యూట్ కంపెనీ ఎల్ ఎల్ పి ప్యానెల్ అండ్ టి వి మాన్యుఫాక్చరింగ్ రూ. 1200 కోట్లు, వర్చువల్ మేజ్ కంపెనీ జి పి ఎస్ ట్రాకర్ ఈ వి బ్యాటరీ పి సి బి రూ. 80 కోట్లు, టెక్నో డోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ టి వి మాన్యుఫాక్చరింగ్ రూ. 52 కోట్లు పెట్టుబడి పెట్టడానికి నేడు గౌ. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి ఐ టి సెక్రెటరీ సౌరభ్ గౌర్, సి ఈ ఓ ఈ ఎం సి గౌతమి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఇది ఒక గొప్ప శుభ పరిణామమని ఇంకా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టాలని ఆ ప్రకటనలో కోరారు.

తూకం యంత్రాలకు ముద్ర తప్పనిసరి



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: దుకాణదారులు ఏటా ఎలక్ట్రానిక్ తూకాల యంత్రాలకు తప్పనిసరిగా ముద్ర వేయించుకొని రసీదు పొందాలని తిరుపతి డివిజన్ లీగల్ మెట్రాలజీ అధికారి మల్లేశ్వర అన్నారు. గత వారం రోజులుగా మండలంలోని ప్రతి దుకాణదారుల తూకాల యంత్రాలను సరి చూసి తనిఖీలు చేశారు. బోడెవాండ్లపల్లిలో సక్రమంగా లేని మూడు దుకాణ తూకాల యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో దాదాపు 200 దుకాణాలను తనిఖీ చేసి రసీదులు అందించారు. దుకాణదారులు ఎవరైనా అధిక ధరలకు సరుకులు అమ్మినా.. తూకాల్లో తేడాలు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-కోట: శ్యామసుందరపురం గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం కోట తహశీల్దారు పద్మావతి, ఎంపీడీవో భవాని పాల్గొని పూజలు చేపట్టారు. శ్రీ సాయి మార్గ్ సేవా ట్రస్ట్ సభ్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-వరదయ్యపాళెం: మండల కేంద్రంలో మణెయ్య అనే రైతుకు చెందిన గడ్డివామి శుక్రవారం అగ్నికి ఆహుతైంది. పది ఎకరాల్లో వ్యవసాయం చేసి నిల్వచేసిన గడ్డివామి కాలిపోవడంతో ఏం చేయలేని దయనీయ పరిస్థితిలో ఉన్నానని రైతు వాపోయాడు. మూగజీవాల కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డివామి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికే జరగాల్సిన నష్టం పూర్తిగా జరిగిపోయింది. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలకు మద్దతు ధర

ప్రజాశక్తి-బాలాయపల్లి : అవసరం మేరకు రైతు కోనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని.. ప్రభుత్వం పంటలకు మద్దతు ధర కల్పిస్తోందని ఏవో శిరీష అన్నారు. శుక్రవారం బాలాయపల్లిలో వరి కొనుగోలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈపంట నమోదు కారణంగా ఉపయోగాలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల కారణంగా పంట నష్టం జరిగితే బీమా లబ్ధి పొందేందుకు అవసరమన్నారు.

తిరుమలలో 8 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

ప్రజాశక్తి-తిరుమల: జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలలో ఎనిమిది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను తిరుమల ట్రాఫిక్ పోలీసులు నమోదు చేశారు. 8 మందిని తిరుపతి కోర్టులో హాజరపరచగా రెండో అదనపు జడ్జి కోటేశ్వరరావు ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించారు. తనిఖీలలో డీఎస్పీ వేణుగోపాల్, ఎస్సై రామచంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర సంగీత కళాశాల ప్రిన్సిపల్‌గా ఉమ



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని స్థానిక శ్రీ వేంకటేశ్వర సంగీత, నత్య కళాశాల నూతనంగా ప్రిన్సిపల్ గా కళా కౌముది డాక్టర్ ఎం.ఉమా ముద్దుబాల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన భరతనాట్య విభాగాధిపతి డాక్టర్ ఎం.ఉమా ముద్దుబాల కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు, భరతనాట్య విభాగ పూర్వ , ప్రస్తుత విద్యార్థులు, శరత్ చంద్ర తదితర విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. విద్యార్థులు చక్కగా తరగతులకు హాజరై సంగీతం, నత్య ప్రావీణులై దేశవిదేశాలలో తమ సత్తాను చాటాలని ఆకాంక్షించారు. కళాశాల ఆధ్వర్యంలో సాయంకాలం డిప్లమా కోర్సును క్రమ పద్ధతిలో నిర్వహించేందుకు కృషి చేస్తానని వివరించారు.

అన్నమాచార్యలో ఏకాగ్రతపై ఉపన్యాసం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని అన్నమాచార్య కళాశాలలో శుక్రవారం ఐక్యూఏసి, ఇస్కాన్ యూత్ ఫోరం శ్రేయస్ ఆధ్వర్యంలో గౌరంగ దర్శన్ దాస్ పరధ్యానం నుంచి ఏకాగ్రత సాధించడం ఎలా అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. నాధమునిరెడ్డి మాట్లాడుతూ సైన్స్, ఆధ్యాత్మిక రెండూ పరస్పరం అనుసంధామైందని పేర్కొన్నారు. అనంతరం గౌరంగ దర్శన్ దాస్ ఏకాగ్రతను ఎలా పెంపొందించుకోవాలి.. మనస్సుని ఎలా నిగ్రహించుకోవాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం ఐక్యూఏసి కో ఆర్డినేటర్ డాక్టర్ కె. రమ్య మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి, విభాగాధిపతులు, విద్యార్థులు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

శ్రీరామలో అంతర్ కళాశాల సాంస్కృతిక పోటీలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండో రోజు శుక్రవారం అంతర్ కళాశాల సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విద్యార్థినులకు పాటలు, నత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. బాలికల గ్రూప్ డాన్స్‌లో శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కావ్య గ్రూప్ మొదటి బహుమతి, తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని జ్యోత్స్న గ్రూప్ రెండో బహుమతి సాధించారు. పాటల పోటీల్లో మొదటి బహుమతి శ్రీ రామ కళాశాల విద్యార్థిని ద్వైత సాధించగా.. సోలో నత్య పోటీల్లో అదే కళాశాలకు చెందిన రమ్యశ్రీ మొదటి బహుమతి సాధించారన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో వేడుకగా విద్యార్థులకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర గెలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, కన్వీనర్ ప్రతిభ, కోఆర్డినేటర్స్ గ్రీష్మ, షామిలి, రాజేశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రగతిపై సమీక్ష

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: చీఫ్ ఎగ్జిక్యుటివ్ సి.ఎం.ఓ.కార్యాలయ డా.సమీర్ శర్మ జిల్లాలో రెండు రోజులు పర్యటించ నున్నారని , సుస్థిర అభివద్ధి లక్ష్యాల ప్రగతి , ప్లాస్టిక్ నిషేధం, ఇ- వేస్ట్ , బ్యాటరీ డిస్పోజల్ వంటి వాటి పై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించ నున్నారని, సంబంధిత శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ చాంబర్ లో కలెక్టర్ సమీక్ష నిర్వహించి సూచనలు చేసారు. జిల్లాలో సుస్థిర అభివద్ధి లక్ష్యాల సాధనకు చేపడుతున్న చర్యలు, వాటిపై నివేదిక సిద్ధం చేయాలని అన్నారు. ఈ నెల 4 న ఉదయం తిరుపతి చేరుకొని సమీక్ష నిర్వహించనున్నారని అనంతరం తిరుమలలో బస చేస్తారు. ఈ నెల 5 న తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారని వివరించారు. జిల్లా ప్రణాళికాధికారి అశోక్ కుమార్, డి.ఎల్.డి.ఓ. సుశీలా దేవి, ఐ డి సి డి ఎస్ పిడి జయలక్ష్మి, డి.ఎం.హెచ్.ఓ శ్రీహరి ,డి.ఇ.ఓ. శేఖర్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ సాయం



ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతి భవాని నగర్ నగరపాలక ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి పేదవిద్యార్థులకు వంటకు ఉపయోగించే ప్రెజర్ కుక్కర్ ,నోటుబుక్స్, కాపీ రైటింగ్ బుక్స్ , బిస్కెట్ లను వితరణ చేశారు. లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, లయన్స్ క్లబ్ అఫ్ సెవెన్ హిల్స్ కార్యదర్శి వి. జగన్నాధం, బెల్లంకొండ సురేష్, రోహిత్, దేవరాజులు నాయుడు పాల్గొన్నారు.